క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



కాళేశ్వరం: ముస్లింల ఆధ్వర్యంలో కాళేశ్వరం జామా మజీద్ నూతన కమిటీని ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. మజీద్ కమిటీ సదర్(అధ్యక్షుడు)గా సయ్యద్ సమద్, (ఉపాధ్యక్షుడు)నాయబ్ సదర్‌గా షేక్ జానీ, కోశాధికారిగా సయ్యద్ ఖాజపాషా, కార్యవర్గ సభ్యులుగా ఎండీ దీన్‌మహ్మద్, ఎండీ హాజీబాబా, సయ్యద్ పాషా, సయ్యద్ వాజీద్, రయాన్‌ఖాన్, ఎండీ నెలియాజ్, షేక్ దీన్‌మహ్మద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా ముస్లింలు నూతన కమిటీని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ సయ్యద్ నిసార్, మౌజన్ శఫీక్, షేక్ శకీల్, కైసర్, మసుద్, నబి తదితరులు ఉన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



కాళేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సైలు భవానిసేన్, చక్రపాణి అన్నారు. ఓటు హక్కుపై విశ్వాసాన్ని పెంపొందించే చర్యల్లో భాగంగా సీఆర్పీఎఫ్ బలగాలతో శుక్రవారం కాళేశ్వరంలో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. గొడవలు, ఘర్షణలకు పాల్పడితే జీవితాంతం బైండోవర్‌ల పాలవుతారని హెచ్చరించారు. ప్రజలు సమన్వయంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్‌పోలీసులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి



రేగొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ బాధ్యతగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి పిలుపునిచ్చాడు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓటు హక్కు వినియోగించుకొని మాట్లాడారు. ప్రజాస్వామ్యం గొప్పతనం, దాని మనుగడ ఓటు పైనే ఆధారపడి ఉంటుందని అన్నారు.

బీజేపీలో చేరిక



మహాముత్తారం: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు శుక్రవారం బీజేపీలో చేరారు. రాజుకు కాటారం మండల కేంద్రంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, చల్ల నారాయణ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పూర్ణచందర్, కాటారం ఇన్‌చార్జ్ పిలుమర్రి సంపత్, బండ శ్రీకాంత్, నాయకులు శేఖర్, అరుణ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

షార్ట్‌ఫిల్మ్‌ను ఆదరించాలి

ఏటూరునాగారం: గోరంట్ల ఎంటర్ టైన్‌మెంట్స్ గోరంట్ల సదానందం–చంద్రకళ సమర్పణలో చిత్రించబోతున్న 'ఇస్మార్ట్ దొంగలు' అనే షార్ట్‌ఫిల్మ్‌ను అందరూ ఆదరించాలని సీఐ మండల రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద ఔత్సాహిక కళాకారులతో ఇస్మార్ట్ దొంగలు షార్ట్‌ఫిల్మ్ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముహూర్తపు సన్నివేశానికి సీఐ మండల రాజు క్లాప్ నివ్వగా, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.వరప్రసాద్ రావు దర్శకత్వం వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ షార్ట్ ఫిల్మ్ ఉంటుందని, అంతా లోకల్ టాలెంట్ తో ఇస్మార్ట్ దొంగలు తీస్తున్నామని దర్శకుడు గోరంట్ల సత్యం తెలిపారు. కార్యక్రమంలో చిప్ప అశోక్, పెండ్యాల ప్రభాకర్, పెండ్యాల భాస్కర్, కోడి వెంకట్, ప్రతాప్, సంగీతం బల్లెపల్లి మోహన్ కెమెరా మెన్ సాయి కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

పలిమెల: మండలంలోని నీలంపల్లి గ్రామంలో వాసం రమణక్క (48) పాము కాటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రమణక్క ఉదయం నిద్రలేచి ఇంట్లో పనులు చేసుకుంటున్న సమయంలో ఇంట్లోకి చొరబడిన పాము రమణక్కను కాటువేసింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



కాటారం: ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్హర్: మట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం: కాంగ్రెస్‌తోనే దేశంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రధాన కూడలిలో వ్యాపారస్తులు, దుకాణాల యజమానులను కలిసి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే పాంచ్ న్యాయ్ అమల్లోకి తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, బండం వసంతరెడ్డి, కొట్టె శ్రీహరి, చీమల రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మల్హర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని తాడిచర్ల ఈదుల చెరువు, చింతల కుంట, రామసముద్రం చెరువుల్లో ఉపాధిహామీ పనులు చేస్తూన్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధిహామీలో రోజు వారి కూలి రూ.400 చెల్లించడంతో పాటు 200 రోజుల పనిదినలు కల్పించనున్నట్లు వివరించారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, ఇందారపు చంద్రయ్య, కొండ రాజమ్మ, మండల రాహుల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారంలో..



కాళేశ్వరం: నాగేపల్లిలో..

మహాముత్తారం: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంతో పాటు యత్నారం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ నజీర్‌ఖాన్, నాయకులు దుర్గయ్య, దన్‌సింగ్, గడ్డం రాజబాపు, ముక్కెర రాజమల్లు, తదితరులు ఉన్నారు.

'రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం నాగేపల్లిలో ఉపాధిహామీ కూలీల వద్దకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెళ్లి శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీని ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, ఎంపీపీ రాణిబాయి, ఎంపీటీసీలు మమత, దుర్గయ్య, మహిళ అధ్యక్షురాలు బందెల సత్తమ్మ, బ్లాక్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యను గెలిపించాలి

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకుడు అప్పం కిషన్ అధ్యక్షతన జిల్లాలోని చర్చిల పాస్టర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. క్రిస్టియన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు దేవన్, యూత్ నాయకులు పిప్పాల రాజేందర్, జిల్లాలోని పాస్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి మండలంలోని నందిగామ మాజీ సర్పంచ్ పోతుగంటి శ్యామ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొడ్డు సదానందంతో పాటు 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మళ్లీ హామీలు ఇవ్వడం హాస్యాస్పదం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్

చిట్యాల: గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఎంపీ ఎన్నికలకు మళ్లీ హామీలు ఇవ్వడం హాస్యాస్పదం ఉందని జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని ఏలేటి రామయ్యపల్లి, చింతకుంట రామయ్యపల్లి, చిట్యాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు బంధు లాంటి ఎన్నో పథకాలు ఇచ్చిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో బోగస్ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలం చెందారని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరేపల్లి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్‌రావు, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, నాయకులు అల్లం రవీందర్, పాండ్రాల స్వామి , చిలుముల రమణాచారి, దామెర రాజు, పులి రవి, కందుల రమేష్, కట్కూరి రాజేందర్, బుట్టి ఉపేందర్, లింగారెడ్డి, పోశాల రాజు, ఏకు ప్రవీణ్, దూడపాక సుమన్, కొడెలనంది, శ్రీకాంత్, ముసాపూరి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఏఎస్పీ మహేష్ బాబాసాహెబ్

మంగపేట: మండల పరిధి కమలాపురంలోని శ్రీ శిరిడీ సాయిబాబా దేవాలయ 14వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు వందల సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిట లాండింది. కార్యక్రమంలో ఆలయ దాతలు, ఏటూరునాగారం ఏస్పీ మహేష్ బాబాసాహెబ్ గీతే, ఎస్సై గోదారి రవికుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు సాయిబాబాకు అలంకరించిన శాలువాలతో సత్కరించారు. మధ్యాహ్న హారతి అనంతరం ఆలయంలో భక్తులుకు తీర్థ ప్రసాదాలు అందచేసి అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దు



రేగొండ: మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి



కొత్తపల్లిగోరిలో పాల్గొన్న నాయకులు



టేకుమట్లలో..

రేగొండ: కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమలగిరి, రామన్నగూడెం తండా, జూబ్లీనగర్, భాగిర్థిపేట, గూడెపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మళ్లీ పార్లమెంట్ ఎన్నికలలో ఓటు అడగడం సిగ్గు చేటని అన్నారు. అనంతరం జూబ్లీనగర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు లెంకల లింగారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ రహీమ్, మండల పార్టీ అధ్యక్షులు అంకం రాజేందర్, సీనియర్ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, హింగే మహేందర్, కరుణాకర్‌రెడ్డి, ఆకుల రమేష్, ముద్దమల్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిగోరిలో..

కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికలలో ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు సాంబారి సాయికుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలంటూ ప్రజలను మభ్యపెట్టి, ఉద్దెర హామీలిచ్చిన కాంగ్రెస్ ను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ హామీద్, మండల యూత్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, టౌన్ అధ్యక్షుడు తిరుపతి, గండ్ర యువసేన నాయకులు సుమన్, శంకర్ నాయకులు సంతోష్, బట్టు శ్రీనివాస్, కుమారస్వామి, కరుణాకర్, చందర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ బోగస్ హామీలిచ్చిందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. శుక్రవారం మండలంలోని రామకృష్ణాపూర్ (టి) గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కి పార్లమెంట్ ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు.

గ్రామాల్లో హోం ఓటింగ్



వెంకటాపురం(కె): హోం ఓటింగ్‌లో అధికారులు



వాజేడులో..

వాజేడు: మండలంలో శుక్రవారం హోం పోలింగ్ నిర్వహించారు. మండలంలో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు వేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ.. 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎన్నికల అధికారులుగా ఏఓ నర్సింహరావు, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, వెంకటాపురం(కె) డీటీ మహేందర్ పాల్గొని వారికి పోలింగ్ నిర్వహించారు. మండల పరిధిలోని చంద్రుపట్ల 1, పేరూరు 1, చిన్న గొళ్లగూడెం 1, రాంపురం 1, ధర్మవరం 1, కొంగాల 3, మొరుమూరు 1, బొల్లారం 1, ఉండగా వారందరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంతో పాటు ఎదిర, ఆలుబాక, వీరభద్రవరం, బెస్తగూడెం గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో హోం ఓటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 85 సంవత్సరాల పైబడిన వారు ఇద్దరు, వికలాంగులు ఐదుగురు పోస్టల్ ఓటింగ్‌కు ఆప్లై చేసుకున్నారని తెలిపారు. ఆప్లై చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి హోం ఓటింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ రాజేష్ తదితరులు ఉన్నారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య



పవన్‌కుమార్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్: మనస్థాపంతో ఓ సింగరేణి కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం గ్రామంలో చోటు చేసుకొంది. భూపాలపల్లి ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగేడు గ్రామానికి చెందిన తరాల సురేష్ (31) వారసత్వంగా వచ్చిన సింగరేణి ఉద్యోగాన్ని గోదావరిఖనిలో చేస్తూ గురువారం సాయంత్రం ఉద్యోగానికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. సురేష్ శుక్రవారం ఉదయం గొల్లబుద్దారం గ్రామంలో పురుగుల మందు తాగి మృతి చెంది ఉండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. గతంలో భార్యలో విడాకులు కాగా తల్లితో కలిసి నివాసముంటున్నాడు. ఒంటరిగా ఉండటంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు మృతుడి తల్లి సుగుణ ఇచ్చిన ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఏరియాలో ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని కేటీకే ఓసీ–3లో కార్మికులు పతాకం ఆవిష్కరించి చేపట్టి కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ ఏర్పడిన నాటి నుంచి కార్మికుల హక్కుల కోసం చేపట్టిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గని ఫిట్ కార్యదర్శి హరికృష్ణ, నాయకులు సదయ్య, మహమ్మద్ ఆలీమ్, సంపత్, రాజేష్, కార్మికులు పాల్గొన్నారు.

బార్డర్ చెక్‌పోస్టులో విస్తృత తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాళేశ్వరం బార్డర్ చెక్‌పోస్టు వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి తరలివస్తున్న ప్రైవేటు వాహనాల్లో మద్యం, డబ్బు, మత్తుపదార్థాలు, ఆయుధాలు తరలిపోకుండా చర్యలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల గుండా వస్తున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానితులు కనిపిస్తే విచారించి, వారి అడ్రస్ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఆయన వెంట సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

రేగొండ: మండల పరిషత్ కార్యాలయంలో నేడు (శనివారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు తెలిపారు.

కరెంట్ తీగలు అమర్చితే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై తమాషారెడ్డి

పలిమెల: అడవి జంతువుల కోసం వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తమాషారెడ్డి హెచ్చరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా శుక్రవారం పలిమెల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంకేన గ్రామంను సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై తమాషారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ పార్టీలు అడవి ప్రాంతాలలో కూంబింగ్‌లు నిర్వహించడం జరుగుతుందని, అటవీ అధికారులు అటవీ సంరక్షణకు రాత్రి పగలు అని తేడా లేకుండా విధి నిర్వహనలో భాగంగా అడవిలో తిరుగుతుంటారని తెలిపారు. ఇటీవల జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని అడవి జంతువుల కోసం తీగలు అమర్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని కొంతమంది వేటగాళ్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉచ్చులు, తీగలు అమర్చితే రిమాండ్ చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో ఓటు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సరదాగా చేపల వేట



వాటాలు పంచుతున్న మహిళ



చేపలు పడుతున్న మహిళలు

గోవిందరావుపేట: మండల పరిధిలోని దుంపెల్లిగూడెం, రాంనగర్, మాన్యతండా వాసులు శుక్రవారం సరదాగా వాగులో చేపలుపట్టారు. ఎర్రటి ఎండను లెక్క చేయకుండా చేపలు పట్టడంలో పోటీపడ్డారు. పెద్ద, చిన్న, ఆడ, మగ అని తేడా లేకుండా మాన్యతండా వాసులు ఊరి చివర ఉన్న వాగులో చేపలు పడుతూ ఎంజాయి చేశారు. తక్కువగా నీటి శాతం, బురదతో కూడుకున్న వాగుని ఎంచుకొని, ఒక అడ్డుకట్ట వేసి బురదలో చేపల వేట కొనసాగించారు. ఆ బురదలో చేపలు పట్టడం కోసం వారు సరదాగా చిన్నప్పుడు ఆడుకునే ఆటలా భావించి కేరింతలు కొడుతూ చేపలు పట్టారు.

లింగయ్యకు 'గొండ్వానా' మద్దతు



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): మహబూబాబాద్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న చందా లింగయ్యకు గొండ్వనా సంక్షేమ పరిషత్ మద్దతు తెలుపుతున్నట్లు గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆదివాసీ సంఘాలు బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి చందా లింగయ్య కత్తెర గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆదివాసీల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం చేసే వ్యక్తి చందా లింగయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత మోహన్, మట్టి రమేష్, గణేష్ ఉన్నారు.